పాలనపై షాడో పెత్తనం

- అన్ని విభాగాల్లోనూ తనమాటే అంటూ..
- తాను చెప్పిందే చేయాలని హుకుం
- 'మేడం' ఆదేశాలతోనే అధికారి మాట చెల్లుబాటు..
- మున్సిపాలిటీ దుస్థితి



తెనాలి మున్సిపల్ కార్యాలయం



తెనాలిఅర్బన్: పురపాలక సంఘ కార్యాలయంలో 'షాడో' పాలన సాగుతోంది. ఆయన అధికారి స్థాయి హోదా లేకున్నా పెత్తనం చేస్తున్నట్లు సమాచారం. మున్సిపాలిటీలోని ఏ విభాగంలోనైనా తనకు చెప్పకుండా ఎలాంటి పనులు చేయకూడదంటూ హుకుం జారీ చేసినట్లు సిబ్బంది చెబుతున్నారు. తనకు సంబంధంలేని శాఖల్లోనూ సమీక్షలు నిర్వహిస్తూ అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నాడు. 'మేడం' ఆదేశాలతోనే అధికారిక పెత్తనం చేస్తున్నట్లు వినికిడి.

అర్హత లేకుండానే డెప్యూటేషన్‌పై...

కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తెనాలి పురపాలక సంఘ పరిధిలోని ఆదాయం సమకూర్చే విభాగంలో ఇటీవల ఓ అధికారి విధుల్లో చేరాడు. సెలక్షన్ గ్రేడ్ హోదా కలిగిన తెనాలి మున్సిపాలిటీకి రావాల్సిన ఉద్యోగి కాదు. వాస్తవానికి అతని పోస్ట్ చిన్నది. కూటమి ప్రభుత్వం వచ్చాక, డెప్యూటేషన్‌పై ఇక్కడకు వచ్చారు. తన క్యాడర్ కాని పోస్టులో ఏడాది డెప్యుటేషన్‌పై ఉత్తర్వులు తెచ్చుకుని, విధుల్లో చేరినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి.

సీనియర్‌నూ బదిలీ చేయించి మరీ!

అప్పటి వరకు ఆ పోస్టులో ఉన్న వ్యక్తి, విధుల్లో చేరి ఏడాది కూడా కాలేదు. ఇంకో సంవత్సరం వ్యవధిలో రిటైర్ కానున్న అధికారి. అతడిని సుదూర ప్రాంతానికి బదిలీ చేయించి మరీ ఈ పోస్టులోకి దర్జాగా వచ్చేశాడు. ఏడాదిలో పదవీ విరమణ చేయనున్న వ్యక్తి వేరే జిల్లాకు వెళ్లలేక తన ఉద్యోగానికి రాజీనామా చేయాల్సిన పరిస్థితిని కల్పించాడు.

అన్ని విభాగాలపై ఆధిపత్యం కోసం...

సదరు అధికారి విధుల్లో చేరిన వెంటనే కార్యాలయంలోని అన్ని విభాగాల్లో తన మనుషులను ఏర్పాటు చేసుకున్నాడు. ఇక్కడ జరిగే ప్రతి అంశంపైనా 'చెవి' పెడుతున్నాడు. విధుల్లో చేరిన కొద్ది రోజులకే తన విభాగంతో పాటు మెప్మా విభాగంలో జోక్యం చేసుకోవటం ప్రారంభించాడు. ఈ విషయాన్ని స్వయంగా ప్రజాప్రతినిధి సతీమణితో చెప్పించాడనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అప్పటి నుంచి తనకు సంబంధం లేని మెప్మాలో జరిగే ప్రతి కార్యక్రమంలో పాల్గొనటంతో పాటు వారిపై పెత్తనం చేయటం ప్రారంభించాడు.

టౌన్‌ప్లానింగ్‌లోనూ ఫైనల్ నిర్ణయం తనదే...

టౌన్ ప్లానింగ్ లావాదేవిలపై ఆరా తీస్తున్నాడు. అలాగే ఏ భవనానికి అనుమతులు ఇవ్వాలి... ఎవరికి ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టాలనేది అతడిదే తుది నిర్ణయంగా మారిందని అంటున్నారు. పట్టణంలో ఎక్కడ ఆక్రమణలు తొలగించాలనేది కూడా అతడి ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు నడుచుకోవాల్సిన పరిస్థితి. ఇటీవల ఇంజినీరింగ్ సెక్షన్‌పై కూడా పెత్తనం చేసే పనిలో సదరు అధికారి దిగారు. నాజరుపేటలో నూతనంగా చేపట్టనున్న అభివృద్ధి పనికి సంబంధించిన ప్రాంతాన్ని 'షాడో' అధికారి స్వయంగా వెళ్లి పరిశీలించారు. ఎలా చేయాల్సిందీ ఆయనే సూచనలివ్వసాగారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ప్రజాప్రతినిధి, 'నీకు ఇక్కడ ఏమి పని' అంటూ ప్రశ్నించటంతో పాటు మరోసారి తన వార్డులో కన్పిస్తే సహించేది లేదని హెచ్చరించటంతో క్షమాపణ చెప్పి వెళ్లిపోయాడు.

మున్సిపల్ మార్కెట్లో పనులకు హడావుడి...

మున్సిపల్ మార్కెట్‌కు మంత్రి త్వరలో రానున్నారని, దానిలో చేపట్టనున్న పనులను తనను పర్యవేక్షించమని చెప్పాడంటూ కొద్దిరోజుల క్రితం హడావిడి చేశాడు. అలాగే మార్కెట్‌ను పరిశీలించేందుకు ఏఈలను సమాయత్తం చేశాడు. విషయం తెలుసుకున్న ఇంజినీరింగ్ అధికారి దానికి గండి కొట్టాడు. మున్సిపాలిటీలో ఇదే అంశాన్ని పలువురు చర్చించుకున్నారు. అంతటితో ఆగకుండా మున్సిపల్ కార్యాలయం ముందు ఉన్న వీధి దీపాలు వెలగటం లేదని, వెంటనే బాగు చేయాలని సిబ్బందిని ఆదేశించటంతో వారు గంటల వ్యవధిలో చేశారు.

ఆ అధికారికి అండగా 'మేడం'...

కూటమి ప్రభుత్వం వచ్చాక కొందరు అధికారులను పిలిపించి తమ ఆదేశాలు లేకుండా ఎవరికీ పనులు చేయొద్దని 'మేడం' స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇది తెలిసిన ఆ పార్టీకి చెందిన నాయకులు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. అధికారులకు ఇలా స్పష్టమైన ఆదేశాలను ఇవ్వటమే కాకుండా, మున్సిపాలిటీలో తనకు నమ్మకస్తుడైన ఉద్యోగి డెప్యూటేషన్‌కు సహకరించి, అతడికే పెత్తనం అప్పగించారు. 'మేడం'కు విశ్వాసపాత్రుడైన ఉద్యోగి కనుకనే అతడు మున్సిపాలిటీని శాసిస్తున్నాడని చెప్పుకుంటున్నారు.

8న విద్యార్థులకు పోటీలు

నగరంపాలెం: స్థానిక సంపత్‌నగర్ శ్రీరామనామ క్షేత్రంలో 98వ శ్రీరామకోటి మహోత్సవాల్లో భాగంగా ఈనెల 8న పాఠశాల స్థాయి విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ కార్యదర్శి ఆర్‌వి.లీలా సుందరి, మస్తాన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదేళ్లలోపు విద్యార్థులకు దాశరధి శతకంలో 46- 60 పద్యాల వరకు, కంఠస్థ పాఠవ పోటీలు 10- 15 ఏళ్ల లోపు వారికి భగవద్గీత మూడో అధ్యాయంలోని (కర్మయోగం) ఒకటి నుంచి 21వ లోకాల వరకు, తులసీదాసు విరజిత హనుమాన్ చాలీసా కంఠస్థ పోటీలు, 15 ఏళ్ల లోపు విద్యార్థులకు భక్తి గీతాలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 9885790942 లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

లక్ష్మీపురం: ఉదయం వాకింగ్‌కు వెళ్లి బయటకు వచ్చి చూసేసరికి ద్విచక్ర వాహనం కనిపించక పోవడంతో పరిసర ప్రాంతాల్లో వెతికి పట్టాభిపురం పోలీసులకు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉద్యోగనగర్ ప్రాంతానికి చెందిన ఆలూరి తిరేష్ వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. నవంబరు 21న రోజు మాదిరిగానే గుజ్జనగుండ్లలోని వాకింగ్ ట్రాక్ వెళ్లి వాకింగ్ చేసుకునేందుకు బండి పార్కింగ్ చేసి వాకింగ్ పూర్తి చేసుకుని బయటకు వచ్చి చూసేసరికి ద్విచక్రవాహనం కనిపించలేదు. దీంతో చోరీకి గురైనట్లు గుర్తించి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళల రక్షణ కోసం మహిళ - మీకోసం

లక్ష్మీపురం: మహిళలకు సమస్యలు ఉంటే తక్షణమే మహిళల రక్షణ కోసం 'మహిళ-మీకోసం' 112, 974641464కు సమాచారం తెలియజేయాలని అరండల్‌పేట పోలీసులు తెలిపారు. మంగళవారం అరండల్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో పోలీసు స్టేషన్ పరిధిలోని కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు.

క్లుప్తంగా

రక్త నమూనాల సేకరణ



తెనాలిరూరల్: బోద వ్యాధి నిర్మూలనకు చేపడుతున్న చర్యల్లో భాగంగా మలేరియా విభాగం అధికారులు తెనాలిలో రక్త నమూనాలను మంగళవారం సేకరించారు. జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం ఆదేశాల మేరకు పట్టణ బుర్రిపాలెం రోడ్డులోని బీసీ కాలనీలో మంగళవారం రాత్రి రక్త నమూనాలు సేకరించారు. కాలనీలో ఇంటింటికి తిరిగి సేకరిస్తామని అసిస్టెంట్ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ గుద్దంటి రవికుమార్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, హెల్త్ అసిస్టెంట్ మున్నంగి రత్నాకరరావు, షేక్ బాషీద్, ఏఎన్ఎం కొండమ్మ, ఆశ కార్యకర్త రాణి పాల్గొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

కొల్లిపర: విభిన్న ప్రతిభా వంతుల అభ్యున్నతికి, వారి హక్కులు కాపాడడానికి ప్రతీ ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం కొల్లిపర గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాల(ఆర్)లో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ 1, 2 జి.సాల్మన్‌రాజ్, కె.రూన్సీలత, జనసేన పార్టీ నాయకుడు బీ వేణుగోపాలరెడ్డి పాల్గొన్నారు.

జైపూర్‌లో జీఎంసీ అధికారుల పర్యటన



నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్ మున్సిపల్ కార్పొరేషన్ స్టడీ టూర్‌లో భాగంగా 2వ రోజైన మంగళవారం గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు జైపూర్ గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రుక్మిణి రియార్‌తో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. జైపూర్‌లో రోడ్ల నిర్వహణ, పారిశుద్ధ్య పనులు, హోర్డింగ్స్ పాలసీ, కేబుల్ వైర్ల తొలగింపు, డంప్ యార్డ్‌లను పార్కులుగా అభివృద్ధి చేయడం వంటి పలు అంశాలను చర్చించారు. అనంతరం కమిషనర్ బృందం జైపూర్ నగరంలో క్షేత్ర స్థాయిలో వివిధ వార్డులను నేరుగా పరిశీలించి, స్థానికులు అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు నేరుగా తడి పొడి వ్యర్థాలను వేరు చేసి మున్సిపల్ కార్మికులకు అందించడం, ఒక ఈ ఆటో ద్వారా సుమారు 8 వందల ఇళ్ల నుంచి వ్యర్థాలను సేకరించాడాన్ని పరిశీలించారు. కంపోస్టింగ్‌లో భాగంగా స్థానికులు ప్రతాప్ అగర్వాల్ మట్టి కుండల ద్వారా మట్కా కంపోస్టింగ్ చేసే విధానాన్ని పరిశీలించి ప్రత్యేకంగా అభినందించారు. సులభ్ కాంప్లెక్స్ నిర్వహిస్తున్న పబ్లిక్ టాయ్‌లెట్స్‌ని పరిశీలించి చాలా పరిశుభ్రంగా నిర్వహించడం, అందులో శానిటరీ న్యాప్ కిన్స్ వెండింగ్ మెషిన్ ఉండడం, ఉపయోగించిన న్యాప్ కిన్లను దహనం చేయడానికి యంత్రాలను పరిశీలించారు. జైపూర్ డెవలప్‌మెంట్ అథారిటీ నిర్వహిస్తున్న మసాలా చౌక్, ఫుడ్ కోర్ట్‌లను పరిశీలించి, అక్కడి పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణను ప్రశంసించారు. జైపూర్ సన్ రైజ్ స్త్రీ స్వయం సహాయక సభ్యుల ద్వారా నిర్వహించే పశువుల సంరక్షణ పాయింట్, సహజ సౌందర్య సేంద్రీయ ఉత్పత్తులు, మార్కెటింగ్ విధానాన్ని పరిశీలించారు.

విజ్ఞాన్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్

చేబ్రోలు: మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ మడకా కృష్ణ చెన్నకేశవరావు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో తమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందించిందని వైస్ చాన్సలర్ పీ.నాగభూషణ్ మంగళవారం తెలిపారు. "ఇన్వెస్టిగేషన్స్ ఆన్ కాంపాక్ట్ సీపీడబ్ల్యూ ఫెడ్ సర్క్యులర్లీ పోలరైజ్డ్ వైడ్ అండ్ డ్యూయల్ బ్యాండ్ యాంటీనాస్ ఫర్ 5జీ, వైర్‌లెస్ ల్యాన్ అండ్ శాటిలైట్ అప్లికేషన్స్" అనే అంశంపై మడకా కృష్ణ పరిశోధన చేశారని తెలిపారు. ఈయనకు విజ్ఞాన్ యూనివర్సిటీలోని ఈసీఈ డిపార్ట్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పచియానన్ ముత్తుస్వామి గైడ్‌గా వ్యవహరించారన్నారు. తన పరిశోధనలో భాగంగా 2 ఎస్‌సీఐ, 4 స్కోపస్ పేపర్లు పబ్లిష్ చేశారని వెల్లడించారు. పీహెచ్‌డీ పట్టా పొందిన మడకా కృష్ణ చెన్నకేశవరావును పలువురు అభినందించారు.

ట్యాలీప్రైమ్, జీఎస్టీ కోర్సులో ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: కీట్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ట్యాలీప్రైమ్, జీఎస్టీ, అడ్వాన్స్ ఎక్సెల్ కోర్సులో ఉచిత శిక్షణతో పాటు నూరు శాతం ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు ట్రస్టు ప్రతినిధి హరిప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీకాం, ఎంకాంలో ఉత్తీర్ణులై 20 నుంచి 28 ఏళ్ల లోపు వయసు గల అభ్యర్థులకు విజయవాడలో 60 రోజుల పాటు ఉచిత భోజన, వసతితో కూడిన శిక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 90004 87423 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

పీహెచ్‌సీ సిబ్బంది తీరుపై విచారణ



ప్రజలతో మాట్లాడుతున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ శ్రావణ్ కుమార్

మున్నంగి(కొల్లిపర): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సిబ్బందిపై వచ్చిన ఫిర్యాదులపై మంగళవారం జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ శ్రావణ్ కుమార్ విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన ఎం.సుబ్బారావు చేసిన ఫిర్యాదులపై ప్రజల అభిప్రాయాలు స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలు రాత్రి సమయంలో రైతులకు పాముకాటు, చిన్న చిన్న సమస్యలు వచ్చిన సమయంలో అత్యవసరమైనప్పుడు వైద్యం కోసం దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని, రాత్రి సమయంలో గర్భిణులకు నొప్పులు వచ్చి డెలివరీ సమయంలో వైద్యులు లేక తెనాలి తీసుకుపోవాల్సివస్తుందని, ఎటువంటి ఆపరేషన్లు జరగటం లేదు, విద్యార్థులు వివిధ వాటికి సంబంధించి సంతకాలు తీసుకోవాల్సి వచ్చిన సమయంలో వారికి సహకరించటం లేదన్న ఫిర్యాదులపై విచారణ చేపట్టారు.

చిన్నారులకు అనుబంధ ఆహారాన్ని అందించండి

ఇన్‌చార్జి జిల్లా మలేరియా అధికారి దారావత్ రాజు నాయక్



మాట్లాడుతున్న ఇన్‌చార్జి జిల్లా మలేరియా అధికారి దారావత్ రాజు నాయక్

తెనాలిఅర్బన్: చిన్నారులకు పాలతో పాటు అనుబంధ ఆహారాన్ని అందించాలని ఇన్‌చార్జి జిల్లా మలేరియా అధికారి దారావత్ రాజు నాయక్ సూచించారు. ఆశ డేను పురస్కరించుకుని పాత ప్రభుత్వ వైద్యశాలలో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు మంచి పోషక విలువతో కూడిన ఆహారాన్ని అందిస్తే ఆరోగ్యకరంగా ఉంటారని చెప్పారు. జిల్లా ఉప వైద్య ఆరోగ్యాధికారిణి డాక్టర్ ఈ అన్నపూర్ణ మాట్లాడుతూ తల్లిపాల వల్ల చిన్నారులలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. సమావేశంలో డాక్టర్ దేవరపల్లి సుభాష్ రమాదేవి, సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి, సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, వంగల పున్నారెడ్డి పాల్గొన్నారు.

సబ్‌డివిజనులో 1,034 టన్నుల ధాన్యం కొనుగోలు

తెనాలి: వ్యవసాయ సబ్‌డివిజనులో ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయని, రైతులకు సంబంధిత డబ్బులను వారి ఖాతాల్లో జమ చేస్తున్నట్టు వ్యవసాయ సహాయ సంచాలకులు ఉషారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌డివిజనులోని కొల్లిపరలో 130 మంది రైతుల్నుంచి 735.4 మెట్రిక్ టన్నులు, దుగ్గిరాలలో తొమ్మిదిమంది రైతుల ధాన్యం 70 మెట్రిక్ టన్నులు, తెనాలిలో 31 మంది నుంచి 229.44 టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు తెలిపారు. ఇందుకు సంబంధించి కొల్లిపరలో 110 మంది రైతులకు రూ.1.42 కోట్లను బ్యాంకు ఖాతాలకు జమచేశామని తెలిపారు. దుగ్గిరాలలో నలుగురు, తెనాలిలో 15 మంది రైతులకు నగదు జమయిందని వివరించారు. మూడు మండలాల్లో కలిపి 170 మంది రైతుల దగ్గర్నుంచి 1034.84 టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, వారికి రావాల్సిన రూ.2.12 కోట్లకుగాను రూ.1.75 కోట్లు జమ చేసినట్టు చెప్పారు.

గ్రీవెన్స్‌లో వినతులపై స్పందన



తెనాలిరూరల్: స్థానిక జేఎంజే స్వధార్ హోం శక్తి సదన్‌లోని అనాథలు, మతిస్థిమితం లేని వారు, వృద్ధులకు ప్రభుత్వం తరపున సాయం అందేలా చూడాలని గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీపై తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ స్పందించారు. శక్తి సదన్‌ను మంగళవారం సందర్శించారు. ఈ విషయమై ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కిన్నెర నాగరాజు సోమవారం మధ్యాహ్నం అర్జీ అందజేయగా తహసీల్దార్ సదన్‌లో ఉంటున్న వారితో మాట్లాడారు. అనాథలు, తలిదండ్రులు నిరాకరించిన వారు, మతిస్థిమితం లేని వారు, వృద్ధులతో మాట్లాడి వారి అవసరాలను తెలుసుకున్నారు. వారు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. ప్రతి నెల 50 కిలోల రేషన్ బియ్యాన్ని సదన్‌కు అందజేస్తామని, అర్హులైన వికలాంగులకు పింఛన్ వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

తెనాలిరూరల్: ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త వేధిస్తున్నాడని భార్య పోలీసులను ఆశ్రయించింది. పట్టణానికి చెందిన సమీరా, చేబ్రోలు మండలం రెడ్డిపాలేనికి చెందిన జానీ 2021లో ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. సమీరా మైనర్ కావడంతో జానీపై పోక్సో కేసు నమోదైంది. మేజర్ అయ్యాక తిరిగి వివాహం చేసుకున్నారు. అయితే తనను మానసిక, శారీరక వేధింపులకు గురి చేస్తున్నాడని భర్తపై ఫిర్యాదు చేసింది. వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

శ్రీ మణికంఠ సేవా సమితి అన్నప్రసాద వితరణ



అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో స్వాములు

కొల్లిపర: కొల్లిపర శ్రీ మణికంఠ సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు, భవానీ స్వాములకు అన్నప్రసాద వితరణ మంగళవారం ప్రారంభించారు. శ్రీగంగా పార్వతి సమేత ముక్తేశ్వర స్వామి దేవస్థానంలో సేవా సమితి ప్రెసిడెంట్ ఆరిమండ శివరామకృష్ణారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డిసెంబర్ 3 నుంచి జనవరి 12వ తేదీ వరకు జరుగు నిత్య అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శివరామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సేవా సమితి కొల్లిపర మండలంలోని అయ్యప్ప స్వాములు అందరూ కలసి 2022లో స్థాపించటం జరిగిందని అప్పటి నుంచి సేవా సమితి ద్వారా ప్రతి ఏడాది 40 రోజుల పాటు అయ్యప్ప స్వాములకు, భవానీ స్వాములకు నిత్య అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయంలో అయ్యప్ప సామికి ప్రత్యేక భజనలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ జంగా శంకరెడ్డి, సెక్రటరీ కొల్లి అంజిరెడ్డి, వైస్ సెక్రటరీ బొంతు వెంకటరెడ్డి(దత్తు స్వామి), ట్రెజరీ కొల్లి రఘునాథరెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ భీమవరపు రాజశేఖరరెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు భీమవరపు శివరామిరెడ్డి, బొల్లిముంత అంకమ్మరావు, చింతా వీరాంజనేయులు పాల్గొన్నారు.



రోడ్డే పార్కింగ్ స్థలంలా!

మారీసుపేట ఎస్‌సీఆర్ ఎస్‌ఎంహెచ్ స్కూల్ ముందు ఉన్న రోడ్డు వాహనాలతో నిండిపోతోంది. కొందరు తమ కార్లను అక్కడ పార్కు చేయటం వలన ఎదురుగా భారీ వాహనం వస్తే ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. అంతేకాకుండా స్కూల్ వదిలిన సమయంలో ఆరోడ్డు నిత్యం రద్దీగా ఉండటం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

– తెనాలిఅర్బన్

ఘనంగా వ్యవసాయ విద్యా దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ డాక్టర్ ఆర్ శారదజయలక్ష్మిదేవి

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంఫాం నందున్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మంగళవారం వ్యవసాయ విద్యాదినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిదిగా పాల్గొన్న విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఆర్ శారదజయలక్ష్మిదేవి మాట్లాడుతూ భారతదేశ మొదటి రాష్ట్రపతి, మొదటి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి డాక్టర్ బాబురాజేంద్రప్రసాద్ జయంతి సందర్భంగా వ్యవసాయ విద్యా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలే వేసి నివాళులు అర్పించారు. సిక్స్త్ డీన్స్ కమిటీ సిఫారసులను అనుసరిస్తున్న విశ్వవిద్యాలయం ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం అని తెలిపారు. 60 శాతం ప్రాక్టికల్‌గా నైపుణ్యత పెంచే విధంగా ప్రమాణాలు ఉంటాయన్నారు. నాణ్యమైన వ్యవసాయాన్ని రైతులకు అందించేందుకు, నాణ్యమైన ఉత్పత్తులు సాధించేందుకు విదేశీ ఎగుమతులకు అనువైన వంగడాలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించి రైతుల అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు, పీజీ స్టడీస్ డీన్ డాక్టర్ ఏపీ రమణ, కమ్యూనిటీ సైన్స్ డీన్ డాక్టర్ బి.శ్రీలక్ష్మి, ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ ఎ.మణి, పరిశోధన సంచాలకుడు డాక్టర్ పీవీ సత్యనారాయణ, సీఓఈ డాక్టర్ డి.సంపత్‌కుమార్, లైబ్రరియన్ డాక్టర్ పీ సాంబశివరావు పాల్గొన్నారు.

గురజాడ వెలుగు జాడ- అడుగు జాడ

లక్ష్మీపురం: కవిగా, రచయితగా, బోధకుడుగా, కార్య నిర్వాహకుడుగా, చరిత్ర పరిశోధకుడుగా, విద్యావేత్తగా, విమర్శకుడిగా ఎన్నో బాధ్యతలు నిర్వహించిన బహుమఖ ప్రజ్ఞాశాలి గురజాడ అప్పారావు అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, తెలుగు పండితులు రాజన్న మస్టార్ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురజాడ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి మాట్లాడుతూ తన జీవితకాలంలో అనల్పమైన దార్శనికతతో కాలాన్ని ముందుకు నడిపిన ప్రతిభా మూర్తి, చరిత్రలో తనకంటూ ఒక సుస్థిర స్థానాన్ని సంపాదించుకోవడమే కాదు, తనతోనే నూతన చరిత్ర మొదలైందనిపించుకున్న అసమాన మేధావి గురజాడ అప్పారావు అని అన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో గంజాయి పట్టివేత

ఇద్దరు యువకులు అరెస్ట్



గంజాయితో పట్టుబడిన వారితో ఎక్సైజ్ సీఐ

తాడేపల్లి రూరల్: మంగళగిరి-తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను మంగళగిరి ఎక్సైజ్ పోలీసులు మంగళవారం పట్టుకుని కోర్టుకు హాజరు పరిచారు. సీఐ వీరాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం రైల్వే గేటు వద్ద గంజాయి విక్రయించేందుకు అదే గ్రామానికి చెందిన ఎస్‌కె బాజీబాబు ఉన్నాడని వచ్చిన సమాచారం మేరకు అక్కడకు వెళ్లిన తమ సిబ్బంది బాజీబాబును తనిఖీ చేయగా అతని వద్ద 130 గ్రాముల గంజాయి దొరికిందన్నారు. చిర్రావూరులో సోహావ్ లక్ష్మణ్ సింగ్ అనే వ్యక్తి వద్ద గంజాయి ఉందని సమాచారం రావడంతో అక్కడకు వెళ్లి తనిఖీ చేయగా అతని నివాసంలో 100 గ్రాముల గంజాయి లభించిందని, వీరిద్దరు ఎటువంటి పనులు చేయకుండా చెడు వ్యసనాలకు అలవాటు పడి గంజాయి విక్రయిస్తున్నారని ఆయన తెలిపారు. ఎవరైనా గంజాయి అమ్మినట్లు, కొనుగోలు చేసినట్లు, సేవించినట్లు సమాచారం తెలిస్తే 9440902469 నెంబరుకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

పీఎంఏవై డిమాండ్ సర్వే సత్వరమే పూర్తి చేయాలి

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఎమినిటి కార్యదర్శులు పీఎంఏవై 2.0 డిమాండ్ సర్వేని వేగంగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్.ఓబులేసు ఆదేశించారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు నగరంలో పీఎంఏవై 2.0 డిమాండ్ సర్వేపై మంగళవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఎమినిటి కార్యదర్శులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) 2.0లో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రుణాలు అందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృతనిశ్చయంతో ఉన్నాయన్నారు. అందులో భాగంగా పీఎంఏవై డిమాండ్ సర్వేని నగరంలోని ప్రతి వార్డ్ సచివాలయం పరిధిలో ఈ నెల 7వ తేదీలోపు పూర్తి చేయాలని ఎమినిటి కార్యదర్శులను ఆదేశించారు. పీఎంఏవై 2.0లో రూ.3 లక్షల వార్షిక ఆదాయం కలిగి దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారిలో గతంలో ప్రభుత్వం నుంచి ఇంటి స్థలం పొంది, ఇంటి నిర్మాణానికి లోన్ తీసుకోని వారికి, స్వంత స్థలం ఉండి ఎటువంటి గృహ నిర్మాణ లోన్ పొందని వారు అర్హులన్నారు. అలాగే ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి నివాస స్థలం లేదా ఇళ్లు పొందని వారు కూడా పీఎంఏవై 2.0కు అర్హులన్నారు.

ఎమినిటి కార్యదర్శులు ఇంటింటికి వెళ్లి సర్వే చేసి పీఎంఏవై వెబ్ సైట్‌లో వివరాలను అప్ లోడ్ చేయడం ద్వారా రాష్ట్రానికి, పీఎంఏవై 2.0 లో గృహాలు, ఇంటి లోన్‌లు మంజూరు అవుతాయని, శనివారం నాటికి సర్వే పూర్తి కావాలని ఆదేశించారు. అనంతరం సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) సర్వేపై సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో అదనపు కమిషనర్ మాట్లాడుతూ సచివాలయం పరిధిలోని ప్రతి వీధిలో ఉన్న ప్రతి పరిశ్రమ వివరాలు సేకరించి సర్వే అండ్ సపోర్ట్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. చిన్న తరహా పరిశ్రమలకు ప్రోత్సాహకాలు, అందులో పని చేసే కార్మికుల సంక్షేమ పథకాలు అందించేందుకు సర్వే దోహద పడుతుందన్నారు. ఇప్పటికే వార్డ్ సచివాలయాల వారీగా కమర్షియల్ అవసరాలకు విద్యుత్ కనెక్షన్ తీసుకున్న వివరాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ శంకర్రావు, డీఈఈలు ప్రసాద్, సత్యనారాయణ, ఇండస్ట్రీయల్ ప్రమోషన్ ఆఫీసర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రియుడిపై ఫిర్యాదు

తెనాలిరూరల్: ఇంటికి రావద్దన్నా వచ్చి వేధిస్తున్నాడంటూ ప్రియుడిపై ఓ మహిళ ఫిర్యాదు చేసింది. వివరాలు... నాజరుపేటకు చెందిన దివ్య, సతీష్‌తో గతంలో సహజీవనం చేసింది. కొంత కాలం తర్వాత దూరం పెట్టింది. తన వద్దకు రావద్దని చెప్పినా ఇంటికి వెళుతుండడంతో పోలీసులను ఆశ్రయించింది. వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.